ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 03 సంచిక -129 పేజీలు - 04 వెల - 04/- శనివారం 13 జూన్ 2026



# ప్రజా సేవకు పునరంకితం

**రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి, సంక్షేమంపై తిరుపతి సభలో చంద్రబాబు**

- స్వర్ణాంధ్రే శ్వాసగా పాలన సాగిస్తున్నాం
- సంపద సృష్టిస్తేనే సంక్షేమం గురించి చెప్పాలి
- ఆదాయాన్ని పెంచేవాళ్లకే సంక్షేమం పంచే అధికారం
- తాకట్టు పెట్టే వాళ్లకు రాష్ట్రం గురించి మాట్లాడే అర్హత లేదు
- వెంటిలేటర్‌పై ఉన్న రాష్టానికి ఆక్సిజన్ ఇచ్చిన కేంద్రం
- పోలవరం, అమరావతి,రైల్వేజోన్ లకు చేయూత
- జగన్ విధ్వంసంతో రాష్ట్రం అధోగతి పాలయ్యింది

# ప్రజల తీర్పుతో రాష్ట్ర భవిష్యత్‌కు కొత్త దిశ

**డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్**

- ప్రజలు అధికారంతో పాటు ..
- అతి పెద్ద బాధ్యత అప్పగించారు
- గ్రామాల అభివృద్ధితోనే దేశం బలపడుతుంది
- సమస్యలు గ్రామస్థాయిలోనే పరిష్కారం కావడం మేలు
- సమిష్టి కృషితోనే విశాఖ ఉక్కును కాపాడుకోగలిగాం
- యువత ఆశయాలు, అభివృద్ధి కోసం సమిష్టిగా కృషి




**తిరుపతి జూన్ 12 ఆంధ్ర ప్రగతి**

స్వర్ణాంధ్రే శ్వాసగా పాలన సాగిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. హామీల అమలుతో నిజాయితీ నిరూపించుకుంటున్నామని తెలిపారు. సంపద సృష్టిస్తేనే సంక్షేమం గురించి చెప్పాలి.. ఆదాయాన్ని పెంచేవాళ్లకే సంక్షేమం పంచే అధికారం ఉంటుందని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్నారు. అన్నీ తాకట్టు పెట్టే వాళ్లకు రాష్ట్రం గురించి మాట్లాడే అర్హత లేదని స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో ఎమ్మార్వో ఆఫీసు, ఆసుపత్రులను కూడా తాకట్టు పెట్టారని గుర్తు చేశారు. ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా 'రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి, సంక్షేమం' పేరుతో తిరుపతి సమీపంలోని దామినేడులో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో సీఎం చంద్రబాబు, డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేశ్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, కేంద్రమంత్రులు, కూటమి నేతలు పాల్గొన్నారు.


మిగతా 2లో





# రాజ్యసభకు 24మంది ఏకగ్రీవ ఎన్నిక

**విజేతల జాబితాలో ఖర్గే, తరుణ్ చుగ్**



**న్యూఢిల్లీ, జూన్ 12ఆంధ్ర ప్రగతి** రాజ్యసభకు ఈనెల 18న ఎన్నికలు జరగాల్సి ఉండగా దీనికి ముందే పోటీ లేకుండా 24 మంది పెద్దల సభకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, బీజేపీ జాతీయ కార్యదర్శి తరుణ్ చుగ్ తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికైన వారిలో ఉన్నారు. మొత్తం 27 రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరగాల్సి ఉండగా**మిగతా 2లో...**

# శాంతి చర్చల డైలమా



- ఇంకా ఏదీ ఖరారు కాలేదు
- ట్రంప్ ఒప్పందం ప్రకటనను తోసిపుచ్చిన ఇరాన్
- ఇంకా చర్చలు కొనసాగుతున్నాయి
- ఎలాంటి తుది నిర్ణయమూ తీసుకోలేదని స్పష్టీకరణ



**వాషింగ్టన్, టెహ్రాన్ : జూన్ 12ఆంధ్ర ప్రగతి**

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్.. ఇరాన్‌తో జరుగుతున్న ఉద్రిక్తతలకు ముగింపు పలికే ఒప్పందం త్వరలోనే కుదిరే అవకాశముందని ప్రకటించినప్పటికీ ఆ విషయాన్ని ఇరాన్ తోసిపుచ్చింది. చర్చలు కొనసాగుతున్నాయనీ, అయితే ఇంకా ఎలాంటి తుది నిర్ణయమూ తీసుకోలేదని ఇరాన్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయీ స్పష్టం చేశారు. దీంతో మధ్యప్రాచ్యంలో ఇప్పటికీ అనిశ్చితి కొనసాగుతోంది.

ట్రంప్ ఏమన్నారు?

ఇరాన్‌పై మరోసారి భారీ సైనిక దాడులు చేయాలని అమెరికా సిద్ధమైందని హెచ్చరించిన ట్రంప్.. అనంతరం చర్చల్లో గణనీయమైన పురోగతి సాధించామని చెప్పారు. “ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధాలు తయారు చేయకూడదన్నదే మా ప్రధాన లక్ష్యం. ఆ దిశగా గొప్ప ఒప్పందం**మిగతా 2లో...**

# మనది గూగుల్ అయితే.. వారిది గొడ్డలి

- రప్పా..రప్పా అంటే చూస్తూ ఊరుకునేది లేదు
- రెడ్‌బుక్ తనపని తను చేసుకుంటూ పోతుంది
- రాయలసీమను రాయల్ సీమగా మార్చాం
- తిరుపతి సభలో మంత్రి లోకేశ్ వ్యాఖ్యలు




# పెట్రోల్, డీజిల్ కొనుగోళ్లపై కేంద్రం ఆంక్షలు

- పరిశ్రమలు బంకుల నుంచి కొనొద్దని ఆదేశాలు
- బల్క్ డిపోల నుంచే ఇంధనం కొనాలని సూచన
- రోజుకు 200 లీటర్ల డీజిల్‌కే అనుమతి
- ఆంక్షలు 90 రోజుల పాటు అమలు
- నిల్వలు, బ్లాక్‌మార్కెట్‌పై కఠిన చర్యలు



**న్యూఢిల్లీ, జూన్ 12 ఆంధ్ర ప్రగతి**

దేశంలో పెట్రోల్, డీజిల్ సరఫరాపై కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. పరిశ్రమలు, వాణిజ్య సంస్థలు, పెద్ద కంపెనీలు ఇకపై పెట్రోల్ బంకుల నుంచి పెద్ద మొత్తంలో ఇంధనం కొనుగోలు చేయకుండా ఆంక్షలు విధించింది. ఈ మేరకు పెట్రోలియం శాఖ ఆదేశాలు జారీ చేసింది.**2లో...**

# విద్యుత్ ఛార్జీలను పెంచబోం

**జగన్ ప్రభుత్వం విద్యుత్ వ్యవస్థలో సృష్టించిన విధ్వంసాన్ని సరిదిద్దామన్న గొట్టిపాటి**

**ట్రూడౌన్ విధానం ద్వారా యూనిట్‌కు 13 పైసల చొప్పున ఛార్జీలను తగ్గించామని వెల్లడి**




# తెలంగాణలో రాజకీయాలు చేసే స్వేచ్ఛ పవన్ కల్యాణ్‌కు ఉంది

- ఇటీవల పవన్ సభకు అనుమతి నిరాకరించిన తెలంగాణ ప్రభుత్వం
- శాంతిభద్రతలను దృష్టిలో ఉంచుకుని తీసుకున్న నిర్ణయమే అన్న రేవంత్
- ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి రాజకీయ పార్టీకి, ప్రతి నాయకుడికి సమాన అవకాశాలు ఉన్నాయని వ్యాఖ్య



**న్యూఢిల్లీ, జూన్ 12 ఆంధ్ర ప్రగతి**

తెలంగాణలో జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రాజకీయ కార్యకలాపాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టమైన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో ఎవరైనా రాజకీయాలు చేయడానికి స్వేచ్ఛ ఉందని,**మిగతా 2లో...**

# ప్రజాసేవకు పునరంకితం

**మొదటిపేజీ తరువాయి**

ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రానికి ఆక్సిజన్ ఇచ్చి కేంద్రం బతికించిందని చెప్పుకొచ్చారు. అమరావతి, పోలవరం, రైల్వే జోన్ అంశాల్లో కేంద్ర సహకారం దక్కిందన్నారు. అన్ని వ్యవస్థలను గాడిలో పెడుతున్నామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులున్నా.. ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నామని చంద్రబాబు తెలిపారు. ఎక్కడా లేనివిధంగా ఏపీలో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామన్నారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన లక్ష్యాలతో ముందుకెళ్తున్నామని చెప్పారు. 63 లక్షల మందికి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందజేశామని, ఎంతమంది పిల్లలుంటే అంతమందికీ తల్లికి వందనం పథకం ద్వారా డబ్బులు ఇస్తున్నట్లు తెలిపారు. అన్నదాత సుఖీభవ కింద రైతులకు ఏడాదికి రూ.20 వేలు అందజేస్తున్నామన్నారు. రైతులు, గీత కార్మికులు, వడ్డెర్లు, చేనేతలు సహా అన్ని వర్గాలను ఆదుకున్నామని తెలిపారు. పి4 ప్రయోగంతో ఆర్థిక అసమానతలను తగ్గించామన్నారు. నా రాజకీయ ప్రయాణం తిరుపతిలోనే మొదలు పెట్టా. ఇదే రోజున నాలుగోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశా.. రెండేళ్లయింది. రాష్ట్రాన్ని గెలిపిద్దామని 2024 ఎన్నికల్లో మోదీ, పవన్, నేను కలిశాం. ప్రజల ఆశీర్వాదంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. విభజన వల్ల కొంత నష్టపోతే.. గత ప్రభుత్వం వల్ల పూర్తిగా నష్టపోయాం. 2019లో ప్రజావేదిక కూల్చివేతతో విధ్వంసం ప్రారంభమైంది. విధ్వంస పాలన వల్ల వ్యవస్థలన్నీ నిర్వీర్యమయ్యాయి. గత ప్రభుత్వ విధ్వంసంతో పారిశ్రామికవేత్తలు రాష్ట్రం నుంచి వెళ్లిపోయారు. తప్పుడు కేసులు పెట్టి జైళ్లకు పంపి వేధించారు. ఒక్క నోటీసు కూడా ఇవ్వకుండా నన్ను 53 రోజులు జైల్లో ఉంచారు. పవన్ కల్యాణ్‌ను అడుగడుగునా అడ్డుకొని వేధించారు. మూడు రాజధానుల పేరుతో మూడుముక్కలాట ఆడి చిచ్చు పెట్టారని మండిపడ్డారు. ఎన్నికల్లో విజయం చూసి పొంగిపోలేదు.. రాష్ట్ర దుస్థితి చూసి కుంగిపోలేదు. హంద్రీనీవా పూర్తి చేసి కుప్పానికి నీళ్లు తీసుకొచ్చాం. ఈ ఏడాది కల్యాణి డ్యామ్‌కు నీరు తీసుకొచ్చి.. శ్రీశైలం మల్లన్న, తిరుపతి వెంకన్నను కలుపుతాం. అన్ని రంగాలపై ఏడు శ్వేతపత్రాలు విడుదల చేశాం. ప్రజా ప్రభుత్వం నడిపించే వ్యక్తిగా అన్ని వివరాలు బహిర్గతమే. డబుల్ ఇంజిన్ సర్కారు వల్ల ప్రయోజనాలు ఇవాళ చూస్తున్నాం. వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రానికి ఆక్సిజన్ ఇచ్చి కేంద్రం బతికించింది. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా.. ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నాం.

పోలవరం, అమరావతి, విశాఖ స్టీల్ ప్లాంట్, రైల్వే జోన్ సహా అనేక విషయాల్లో కేంద్రం అండగా నిలిచింది. విశాఖ, అమరావతి, తిరుపతి కేంద్రంగా అన్ని జిల్లాలను అభివృద్ధి చేస్తున్నాం. అన్ని నియోజకవర్గాలను అభివృద్ధి చేస్తాం. ఎన్టీఆర్ భరోసా.. దేశంలోనే అతిపెద్ద సంక్షేమ కార్యక్రమం అన్నారు. గిట్టుబాటు ధర లేకపోతే రైతులను ఆదుకునే కార్యక్రమాలు చేస్తున్నాం. పీ4 ద్వారా ఆర్థిక అసమానతలు తగ్గిస్తున్నాం. ఓటమి ఎరుగని నాయకుడు నరేంద్రమోదీ. గుజరాత్, ఢిల్లీలో మోదీ అనేక కార్యక్రమాలు చేయగలిగారు. 12 ఏళ్లలో ప్రధాని మోదీ సారథ్యంలో దేశం అభివృద్ధివైపు దూసుకెళ్లిందని సీఎం అన్నారు. 2024 ఎన్నికల్లో కూటమి అఖండ విజయం సాధించిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్రాన్ని గెలిపిద్దాం.. ప్రజాస్వామ్యాన్ని కాపాడదామని ప్రజలను కోరామని తెలిపారు. 2024లో 57 శాతం ఓట్ షేర్.. 94 శాతం స్ట్రయిక్ రేట్ సాధించామని చెప్పుకొచ్చారు. 2024లో రాష్ట్రాన్ని ప్రజలే కాపాడుకున్నారని అన్నారు. తన రాజకీయ ప్రయాణం తిరుపతిలోనే మొదలైందన్నారు. రాష్ట్రం, దేశం బాగుండాలని కోరుకునే వ్యక్తి పవన్ అని చంద్రబాబు వెల్లడించారు. వైసీపీ పాలనలో రాష్ట్రాన్ని విధ్వంసం చేశారని సీఎం విమర్శించారు. ప్రజా వేదిక కూల్చివేతతో జగన్ అరాచక పాలన మొదలైందని అన్నారు. కేంద్ర పథకాలు, సాగునీటి ప్రాజెక్టులను పక్కన పడేశారని మండిపడ్డారు. అప్పులు, అరాచకాలు, ఆర్థిక విధ్వంసం తప్ప జగన్ చేసిందేమీలేదని విమర్శించారు. అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేశారన్నారు. కేసులు, జైళ్లతో చీకటి పాలన సాగించారని దుయ్యబట్టారు. అలాంటి దశలో నాలుగోసారి సీఎంగా బాధ్యతలు స్వీకరించినట్లు తెలిపారు. ఏపీలో చీకటి పాలన పోయి.. ప్రజాపాలన వచ్చిందన్నారు. 21వ శతాబ్దం ప్రధాని మోదీదే అని సీఎం స్పష్టం చేశారు. ఆపరేషన్ సిందూర్‌తో దేశానికి మోదీ ఆత్మస్థైర్యం ఇచ్చారన్నారు. 2047 నాటికి భారత్ ప్రపంచంలోనే తిరుగులేని శక్తిగా మారుతుందని ధీమా వ్యక్తం చేశారు. మోదీ పాలనలో భారత్ ప్రతిష్ఠ పెరిగిందని వెల్లడించారు. పుట్టపర్తిలో ఐదో తరం ఫైటర్‌జెట్ తయారుకాబోతోందన్నారు. తిరుపతిలో



బుల్లెట్ ఫ్యాక్టరీ వస్తోందని, రాయలసీమ ఇప్పుడు బంగారుసీమ కాబోతోందన్నారు. వచ్చే నెలలో రాయలసీమ స్టీల్ ప్లాంట్‌ను ప్రారంభిస్తామని తెలిపారు. జొన్నవాడలో బంగారం వెలికితీస్తామన్నారు. గ్రీన్ ఎనర్జీ, సోలార్, విండ్ పవర్‌పై దృష్టి సారించినట్లు చెప్పారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తయారుచేస్తున్నామని తెలిపారు. రూ.లక్ష కోట్లతో రాయలసీమ ముఖచిత్రాన్ని కాపాడతామన్నారు. కల్యాణి డ్యామ్‌కు ఈ ఏడాది నీళ్లు తీసుకొస్తున్నామన్నారు. 3 రాజధానుల పేరుతో మూడుముక్కలాట ఆడారని మండిపడ్డారు. '3 రాజధానులు కాదు.. 3 ప్రాంతాల అభివృద్ధే లక్ష్యం' ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు కూడా ఈసభలో పాల్గొన్నారు.

## ప్రజల తీర్పుతో రాష్ట్ర భవిష్యత్‌కు కొత్త దిశ

ప్రజాస్వామ్యంలో అంతిమ న్యాయనిర్ణేతలు ప్రజలేనని జనసేన అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. 2024 ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పు.. రాష్ట్ర భవిష్యత్‌కు కొత్త దిశను చూపిన చారిత్రాత్మక నిర్ణయమని అన్నారు. కూటమి ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. ప్రజలు రెండేళ్ల క్రితం కేవలం అధికారాన్ని మాత్రమే కాకుండా బాధ్యతను కూడా అప్పగించారని చెప్పారు. ఆ బాధ్యతను నెరవేర్చేందుకు ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలు సమిష్టిగా కృషి చేస్తున్నాయని తెలిపారు. గ్రామమే దేశ అభివృద్ధికి కేంద్ర బిందువని పేర్కొన్న పవన్.. పిల్లల నుంచి పెద్దల వరకు ప్రతి ఒక్కరి భవిష్యత్తును ప్రభావితం చేసే నిర్ణయాలు గ్రామ పంచాయతీల స్థాయిలోనే జరగాలని అన్నారు. గ్రామంలో పరిష్కరించాల్సిన సమస్యలు మండల, జిల్లా లేదా ఎమ్మెల్యే స్థాయికి వెళ్లకుండా స్థానికంగానే పరిష్కారం కావాల్సిన అవసరం ఉందని చెప్పారు. ప్రస్తుతం ప్రతి చిన్న సమస్య కూడా ఎమ్మెల్యేల వద్దకు వెళ్తోందని, రాష్ట్రంలో ఉన్న వందలాది స్థానిక ప్రజాప్రతినిధుల అధికారాలను బలహీనపరిచి, మొత్తం వ్యవస్థను ఎమ్మెల్యేల చుట్టూ కేంద్రీకరించడం సరికాదన్నారు. వ్యవస్థలు బలహీనపడితే కులాలు, ప్రాంతీయ భావాలు బలపడతాయని హెచ్చరించారు. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణను అడ్డుకోవడంలో ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల సమిష్టి ప్రయత్నాలు ఫలించాయని పవన్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో కేంద్రంతో సమన్వయం చేసుకుంటూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రజా తీర్పు ఒక తరం భవిష్యత్‌కు నమ్మకాన్ని ఇచ్చిందని, రాష్ట్ర అభివృద్ధి, యువత భవిష్యత్, ఉపాధి అవకాశాల కోసం కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని అన్నారు. ప్రజలు మౌనంగా ఉన్నా సరైన సమయంలో తమ తీర్పుతో చరిత్రను మార్చగలరని 2024 ఎన్నికలు మరోసారి నిరూపించాయని పేర్కొన్నారు. అహంకారం, విధ్వంసక రాజకీయాలపై ప్రజాస్వామ్యం సాధించిన విజయమే 2024 ఎన్నికల ఫలితమని పవన్ అభిప్రాయపడ్డారు. అధికారం పంచుకోవడం కోసం కాకుండా బాధ్యతను పంచుకుని రాష్ట్ర అభివృద్ధి కోసం కలిసి పనిచేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగానే గ్రామ స్వరాజ్యం, స్థానిక సంస్థల బలోపేతం, ప్రజాస్వామ్య వికేంద్రీకరణపై పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. జనసేన పార్టీ కేవలం 21 సీట్లకే పరిమితమైందంటూ విమర్శలు చేశారని, రాష్ట్ర ప్రయోజనాల కోసం ఆ రోజు తాము చేసిన రాజకీయ త్యాగమే కూటమి విజయానికి పునాది అయిందని అన్నారు. తెలుగు రాష్ట్రాలు మరింత అభివృద్ధి చెందాలంటే కుల, ప్రాంతీయ పరిమితులను దాటి జాతీయ అభివృద్ధి దిశగా ఆలోచించాలని సూచించారు. గ్రామాలకు నిర్ణయాధికారం, బాధ్యతలు పూర్తిస్థాయిలో చేరాయా అనే అంశంపై ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. పంచాయతీరాజ్ శాఖ బాధ్యతలు స్వీకరించినప్పుడు బ్లీచింగ్ పౌడర్ కొనుగోలు చేయడానికి, జాతీయ పండుగలు నిర్వహించడానికి కూడా నిధులు లేవని అధికారులు చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. ఇలాంటి పరిస్థితిని 'బ్రోకెన్ గవర్నెన్స్'గా అభివర్ణించారు. గ్రామాల్లో రోడ్లు ఎక్కడ వేయాలి? ఎవరికి ఇళ్లు అవసరం వంటి నిర్ణయాలు కార్యాలయాల్లో కాకుండా ప్రజల మధ్య గ్రామసభల్లో తీసుకోవాలని పవన్ పేర్కొన్నారు. గ్రామసభలు బలపడితే సర్పంచ్‌లు బలపడతారని, అప్పుడు ఎమ్మెల్యేలు స్థానిక సమస్యల కంటే యువత భవిష్యత్తు, పరిశ్రమలు, అభివృద్ధి వంటి పెద్ద అంశాలపై దృష్టి సారించగలరని అన్నారు. ప్రజాస్వామ్యానికి గ్రామపంచాయతీలే అతిపెద్ద విశ్వవిద్యాలయాలని పేర్కొన్న ఆయన, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాజకీయ ప్రస్థానం కూడా గ్రామస్థాయి నుంచే ప్రారంభమైందని గుర్తు చేశారు. గత రెండేళ్లలో రాజకీయ స్థిరత్వం సాధించడంతో పాటు గ్రామాల వరకు ప్రజాస్వామ్యాన్ని తీసుకెళ్లామని చెప్పారు.

-----------

# మనది గూగుల్ అయితే.. వారిది గొడ్డలి

**తిరుపతి సభలో మంత్రి లోకేశ్ వ్యాఖ్యలు**

**తిరుపతి జూన్ 12ఆంధ్ర ప్రగతి**

కూటమి పాలనలో జేసీబీలు, దాడులు, హత్యలు, బూతులు లేవని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. రెండేళ్ల కూటమి ప్రభుత్వ నమ్మకం, సంక్షేమంపై తిరుపతి దామినీడులో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడుతూ.. వేంకటేశ్వరస్వామి జోలికి వెళ్లొద్దని నాటి సీఎంను హెచ్చరించామని.. దేవుడితో పెట్టుకుంటే పరిస్థితి ఏంటో ఇవాళ అనుభవిస్తున్నారని వ్యాఖ్యానించారు. రాయలసీమ అంటే ఎన్టీఆర్‌కు చాలా ప్రేమ అని తెలిపారు. నాడు కరువు వస్తే జోలె పట్టుకుని సీమ ప్రజలను ఆదుకున్నారని ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేశారు. రాయలసీమను రాయల్‌సీమగా మార్చామని మంత్రి చెప్పారు. రాయలసీమలో రత్నాలు పండేలా చేసిన వ్యక్తి సీబీఎన్ అని కొనియాడారు. గొడ్డలి పార్టీ అరాచక పాలన చూశామన్నారు. టీడీపీ జెండా లేకుండా చేస్తామని నాడు వైసీపీ నేతలు ప్రగల్భాలు పలికారని.. ఇవాళ ప్రజలే వైసీపీ జెండా పీకేసి టీమ్ 11 తీర్పు ఇచ్చారని సెటైర్ విసిరారు. వైసీపీ అరాచకాలు చూస్తూ ఊరుకోమని.. రెడ్‌బుక్ దాని పని అది చేసుకుంటూపోతుందని స్పష్టం చేశారు. రప్పా రప్పా అంటే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. 'మనది గూగుల్... వాళ్లది గొడ్డలి. మనది ఫైటర్‌జెట్.. వాళ్లది ఫ్యాక్షన్. మనది కియా.. వాళ్లది కిడ్నాప్. మనది క్రెడిబిలిటీ.. వాళ్లది క్రిమినాలిటీ' అంటూ మంత్రి లోకేశ్ వ్యాఖ్యానించారు. జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై మంత్రి నారా లోకేష్ ప్రశంసలు కురిపించారు. 'ఎక్కడ నెగ్గాలో, ఎక్కడ తగ్గాలో తెలిసిన వ్యక్తి పవన్ అన్న' అని పేర్కొన్నారు. తనకు సొంత అన్న లేని లోటును పవన్ అన్న తీర్చారన్నారు. రాష్ట్రంలో గత ప్రభుత్వంతో పోలిస్తే పరిస్థితులు పూర్తిగా మారిపోయాయన్నారు. 'ఇప్పుడు ఏపీలో బూతులు లేవు, జేసీబీలు లేవు. అక్రమాలు, దౌర్జన్యాలు కనిపించడం లేదు. ప్రజలకు రెండేళ్లుగా స్వాతంత్ర్యం లభించింది' అని పేర్కొన్నారు. గతంలో తాను చేపట్టిన పాదయాత్రలో దేవుడితో పెట్టుకోవద్దు అని చెప్పానని, ఆ మాటలను పట్టించుకోకుండా వ్యవహరించిన వారి పరిస్థితి ఇప్పుడు అందరికీ కనిపిస్తోందని మంత్రి నారా లోకేష్ ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని భారత క్రికెట్ స్టార్ విరాట్ కోహ్లీతో పోల్చిన లోకేష్.. ఆయన నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందన్నారు. వైసీపీ నాయకత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించిన లోకేష్.. 'టీడీపీ జెండా లేకుండా చేస్తామని చెప్పారు. కానీ ప్రజలే వారి జెండాను పీకేశారు' అని అన్నారు. ప్రస్తుతం కొందరు 'రప్పారప్పా' అంటూ హెచ్చరికలు చేస్తున్నారని.. అయితే తాము చూస్తూ కూర్చోమన్నారు. రెడ్ బుక్ తన పని తాను చేసుకుంటూ పోతుందని హెచ్చరించారు.

అభివృద్ధి విషయంలో కూటమి ప్రభుత్వానికి, గత ప్రభుత్వానికి మధ్య తేడాను వివరిస్తూ నారా లోకేష్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'జగన్ అంటే జెన్-జీ కాదు, జగన్ అంటే గొడ్డలి' అంటూ ఎద్దేవా చేశారు. జగన్‌కు క్రెడిట్ తీసుకునే అలవాటు ఉందని ఆరోపించిన లోకేష్.. 'రానున్న రోజుల్లో స్వాతంత్ర్యాన్ని కూడా మా తాత తెచ్చాడని జగన్ చెప్పినా ఆశ్చర్యపోనక్కర్లేదు' అని వ్యాఖ్యానించారు. దేశానికి వచ్చే ప్రతి రూ.100 పెట్టుబడుల్లో రూ.25 ఆంధ్రప్రదేశ్‌కు వస్తున్నాయని చెప్పారు. రాష్ట్రంలో పెట్టుబడుల ప్రవాహం పెరిగిందని లోకేష్ సంతోషం వ్యక్తం చేశారు.

# తెలంగాణలో రాజకీయాలు చేసే స్వేచ్ఛ పవన్ కల్యాణ్‌కు ఉంది

**మొదటిపేజీ తరువాయి**

నిర్వహించాలనుకున్న బహిరంగ సభకు అనుమతి నిరాకరించిన అంశంపై స్పందించిన సీఎం... ఆ నిర్ణయం పూర్తిగా శాంతిభద్రతల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తీసుకున్నదేనని వివరించారు. ఇందులో రాజకీయ కోణం ఏదీ లేదని స్పష్టం చేశారు.

తెలంగాణ ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి రాజకీయ పార్టీకి, ప్రతి నాయకుడికి సమాన అవకాశాలు ఉన్నాయని రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో రాజకీయ కార్యక్రమాలు నిర్వహించడంపై ఎలాంటి ఆంక్షలు లేవని, నిబంధనల ప్రకారం ఎవరైనా తమ రాజకీయ కార్యకలాపాలు కొనసాగించవచ్చని తెలిపారు.

ఇదే సమయంలో జాతీయ రాజకీయాలపై కూడా ఆయన స్పందించారు. ముఖ్యంగా మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ నాయకురాలు మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ అంశాన్ని ప్రస్తావిస్తూ, ఆ ప్రక్రియపై అనుమానాలు వ్యక్తం చేశారు. ఎలాంటి తీవ్రమైన చట్టపరమైన అడ్డంకులు లేని పరిస్థితిలో నామినేషన్ తిరస్కరించడం ప్రశ్నలు లేవనెత్తుతోందన్నారు.

ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల వ్యవస్థపై ఉందని, ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రతిపక్షాల అవకాశాలను పరిమితం చేసేలా వ్యవహరించడం సరైంది కాదని పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణలో నిష్పక్షపాత ధోరణి అత్యంత ముఖ్యమని, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా వ్యవస్థలు పనిచేయాలని రేవంత్ రెడ్డి సూచించారు.

# రాజ్యసభకు 24మంది ఏకగ్రీవ ఎన్నిక

**మొదటిపేజీ తరువాయి**

వీటిలో 24 స్థానాలకు ఫలితాలు ప్రకటించారు. గెలుపొందిన అభ్యర్థులకు విన్నింగ్ సర్టిఫికేట్లను రిటర్నింగ్ అధికారులు అందజేశారు. రాజ్యసభలో ఎన్డీయే సంఖ్యాబలం 16 కాగా, తాజాగా మరో ముగ్గురు గెలవడంతో ఆ బలం 19కి చేరింది. కాంగ్రెస్ 5 సీట్లు గెలుచుకోగా, నాలుగు సీట్లు ఇంతకు ముందే ఆ పార్టీకి ఉన్నాయి. దీంతో రాజ్యసభలో కాంగ్రెస్‌కు ఒక సీటు మాత్రమే పెరిగింది. ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి వైఎస్ఆర్ కాంగ్రెస్ ఈ ఎన్నికల్లో 3 సీట్లు కోల్పోయింది. ఒడిశా మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ సారథ్యంలోని బిజూ జనతాదళ్ సైతం తన సీట్లు బీజేపీకి కోల్పోయింది. బీజేపీ అభ్యర్థి దేబాశిష్ సమంతరాయ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సమంతరాయ్ మే 26న బీజేడీ రాజ్యసభ పదవి వదిలి బీజేపీలో చేరారు. తిరిగి బీజేపీ నుంచి రాజ్యసభ ఎంపీగా ఎన్నికయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే నాలుగు సీట్లు గెలుచుకోగా, గుజరాత్‌లోని నాలుగు సీట్లను కూడా ఎన్డీయే ఎగరేసుకుపోయింది. అయితే కర్ణాటకలో కాంగ్రెస్ 3 సీట్లు గెలుచుకోగా, బీజేపీ ఒక సీటు దక్కించుకుంది. మధ్యప్రదేశ్‌లోని మొత్తం 3 సీట్లు, రాజస్థాన్‌లోని 3 సీట్లలో రెండు సీట్లు బీజేపీ గెలుచుకుంది. అరుణాచల్ ప్రదేశ్, మణిపూర్‌లోని ఒక్కో స్థానాన్ని బీజేపీ దక్కించుకుంది. మేఘాలయలో ఎన్డీయే భాగస్వామి అయిన ఎన్‌పీపీ అక్కడి ఏకైక స్థానాన్ని గెలుచుకుంది. మహారాష్ట్ర, ఒడిశాలోనూ ఒక్కోసీటును ఎన్డీయే దక్కించుకోగా, తమిళనాడులోని ఏకైక స్థానాన్ని కాంగ్రెస్ గెలుచుకుంది.

# పెట్రోల్, డీజిల్ కొనుగోళ్లపై కేంద్రం ఆంక్షలు

**మొదటిపేజీ తరువాయి**

ప్రస్తుతం కొన్ని ప్రాంతాల్లో డీజిల్‌కు అసాధారణంగా డిమాండ్ పెరిగినట్లు ప్రభుత్వం గుర్తించింది. బల్క్ వినియోగదారులకు విక్రయించే డీజిల్ ధర, సాధారణ పెట్రోల్ బంకుల్లోని ధర కంటే ఎక్కువగా ఉండటంతో అనేక సంస్థలు బంకుల నుంచే భారీగా కొనుగోళ్లు చేస్తున్నాయి. దీంతో సాధారణ వినియోగదారులకు సరఫరా సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని కేంద్రం భావించింది.

ఢిల్లీలో ప్రస్తుతం లీటర్ డీజిల్ ధర పెట్రోల్ బంకులో రూ.95.20గా ఉంది. అదే బల్క్ కొనుగోలుదారులకు ఈ ధర రూ.134.50గా ఉంది. ఈ తేడా కారణంగా పరిశ్రమలు, వాణిజ్య సంస్థలు బల్క్ డిపోల బదులు బంకుల వైపు మొగ్గు చూపుతున్నట్లు ప్రభుత్వం తెలిపింది. పశ్చిమాసియా ఉద్రిక్తతల ప్రభావంతో అంతర్జాతీయంగా ముడిచమురు సరఫరా వ్యవస్థపై ఒత్తిడి పెరిగిందని గుర్తుచేసింది. షిప్పింగ్ వ్యవస్థ కూడా ప్రభావితమవడంతో దేశీయంగా ఇంధన లభ్యతపై ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలోనే తాజా ఆంక్షలు తీసుకొచ్చింది.మరోవైపు 'పెట్రోలియం అండ్ ఎక్స్‌ప్లోసివ్స్ సేఫ్టీ ఆర్గనైజేషన్' (పీఈఎస్ఓ) అనుమతి పొందిన కంటైనర్లకు మాత్రమే డీజిల్ విక్రయించాలి. ఒక వినియోగదారు లేదా ఒక వాహనానికి రోజుకు గరిష్ఠంగా 200 లీటర్ల వరకు మాత్రమే డీజిల్ ఇవ్వాలని ఆదేశించారు. దీన్ని మళ్లీ విక్రయించడం పూర్తిగా నిషేధం. నిల్వ చేయడం, బ్లాక్ మార్కెటింగ్, అనధికారిక కొనుగోళ్లు, ఇంధన మళ్లింపుపై రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని సూచించింది.

ఈ ఆంక్షలు మొదట 90 రోజుల పాటు అమల్లో ఉంటాయి. అవసరమైతే మరో ఉత్తర్వుతో గడువును పొడిగించే అవకాశం ఉంది. దేశవ్యాప్తంగా సాధారణ వినియోగదారులకు ఇంధన కొరత తలెత్తకుండా చూడటమే ఈ నిర్ణయం లక్ష్యమని కేంద్రం వెల్లడించింది.

# శాంతి చర్చల డైలమా

**మొదటిపేజీ తరువాయి**

కుదిరే దశలో ఉంది" అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఒప్పంద పత్రాలు దాదాపు సిద్ధంగా ఉన్నాయనీ, కొన్ని రోజుల్లోనే వాటిపై సంతకాలు జరిగే అవకాశం ఉందని ఆయన తెలిపారు. యూరప్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి ఒప్పందంపై సంతకాలు జరిగే అవకాశముందని కూడా వెల్లడించారు. ఇరాన్ సుప్రీం లీడర్ కూడా ఈ ఒప్పందాన్ని ఆమోదించారని ట్రంప్ ధృవీకరించారు. ఒప్పందంపై సంతకాలు పూర్తి కాగానే ఇరాన్‌పై ఉన్న దిగ్బంధాన్ని అమెరికా తక్షణమే ఎత్తివేస్తుందని, దీనివల్ల చమురు ధరలు భారీగా పడిపోతాయని అంచనా వేస్తున్నట్టు ఆయన చెప్పారు. ఈ ఒప్పందం ప్రకారం అణు ఆయుధాలను అభివృద్ధి చేయబోమని, వాటిని కలిగి ఉండబోమని ఇరాన్ అంగీకరించిందని ట్రంప్ చెప్పడం గమనార్హం. ఇరాన్‌తో కుదిరే ఈ అధికార ఒప్పందం పూర్తయ్యే వరకు అమెరికా, మిత్రదేశాలు అమలు చేస్తున్న నౌకాదళ దిగ్బంధం (నావల్ బ్లాకేడ్) యథావిధిగా కొనసాగుతుందని ట్రంప్ తన సోషల్‌ట్రూత్‌లో స్పష్టం చేశారు. తుది ఒప్పంద పత్రాలపై సంతకాలకు సంబంధించిన తేదీ, ప్రదేశ వివరాలను త్వరలో ప్రకటిస్తామని ఆయన వివరించారు.

**ఇరాన్ స్పందన**

అయితే ట్రంప్ వ్యాఖ్యలను ఇరాన్ జాగ్రత్తగా ఖండించింది. ఒప్పంద ముసాయిదాలో ఎక్కువ భాగం సిద్ధమైనప్పటికీ, అమెరికా చివరి నిమిషంలో కొత్త డిమాండ్లు పెడుతోందని బఘాయీ ఆరోపించారు. తమ "రెడ్ లైన్స్" నుంచి వెనక్కి తగ్గబోమని స్పష్టం చేశారు. ఇరాన్ ప్రధానంగా తన అణు కార్యక్రమంపై అధిక పరిమితులను అంగీ కరించేందుకు సిద్ధంగా లేదనే సంకేతాలు ఇస్తోంది. అలాగే క్షిపణి కార్యక్రమం, ప్రాంతీయ మిత్ర బలగాలకు మద్దతు వంటి అంశాల్లో కూడా రాజీకి ఆస్కారం తక్కువగా కనిపిస్తోంది.

**కొనసాగుతున్న ఉద్రిక్తతలు**

ఒప్పంద చర్చలు జరుగుతున్నప్పటికీ, మధ్యప్రాచ్యంలో పరిస్థితులు మాత్రం ఇంకా ఆందోళనకరంగానే ఉన్నాయి. అమెరికా, ఇరాన్ ఒకదానిపై ఒకటి దాడులు చేసుకుం -టున్నాయి. దక్షిణ ఇరాన్‌లోని రాడార్, నిఘా కేంద్రాలపై అమెరికా దాడులు చేయగా, ప్రతిగా బహ్రెయిన్, కువైట్, జోర్డాన్‌లలోని అమెరికా స్థావరాలపై ఇరాన్ దాడులు చేసింది. కాగా ట్రంప్ ప్రకటనల నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్లలో చమురు ధరలు ఒక్కసారిగా తగ్గాయి. బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు సుమారు 89 డాలర్లకు పడిపోయి, ఒక్క రోజులోనే 4.4 శాతం క్షీణించింది. హార్ముజ్ జలసంధి మళ్లీ పూర్తిగా తెరుచుకుం టుందనే ఆశలు ఇందుకు కారణమ య్యాయి. ప్రపంచ చమురు, సహజ వాయువు రవాణాలో కీలకమైన హార్ముజ్ జలసంధిని ఇరాన్ దాదాపు మూసివేయ డంతో గత కొన్ని నెలలుగా అంతర్జాతీయ వాణిజ్యం తీవ్ర ప్రభావాన్ని ఎదుర్కొంటున్న విషయం విదితమే.

# విద్యుత్ ఛార్జీలను పెంచబోం

**జగన్ ప్రభుత్వం విద్యుత్ వ్యవస్థలో సృష్టించిన విధ్వంసాన్ని సరిదిద్దామన్న గొట్టిపాటి**

**ట్రూడౌన్ విధానం ద్వారా యూనిట్‌కు 13 పైసల చొప్పున ఛార్జీలను తగ్గించామని వెల్లడి**

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తీవ్రంగా దెబ్బతిన్న విద్యుత్ రంగాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం విజయవంతంగా పునరుద్ధరించిందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... జగన్ ప్రభుత్వం విద్యుత్ వ్యవస్థలో సృష్టించిన విధ్వంసాన్ని కేవలం రెండేళ్లలోనే సరిదిద్ది, పట్టాలెక్కించామని పేర్కొన్నారు.గత రెండేళ్లలో విద్యుత్ ఛార్జీలను ఒక్క రూపాయి కూడా పెంచలేదని... రాబోయే మూడేళ్లలో కూడా విద్యుత్ ఛార్జీలు పెంచబోమని ఆయన స్పష్టమైన హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం వినియోగదారులపై అదనపు భారం మోపిన 'ట్రూ అప్' విధానానికి స్వస్తి పలికి, చరిత్రలోనే మొదటిసారిగా 'ట్రూ డౌన్' విధానాన్ని తీసుకువచ్చామని తెలిపారు. దీని ద్వారా యూనిట్‌కు 13 పైసల చొప్పున ఛార్జీలను తగ్గించి, ప్రజలకు రూ. 4,498 కోట్ల మేర ఉపశమనం కలిగించామని వెల్లడించారు.గత వైసీపీ ప్రభుత్వం తన ఐదేళ్ల కాలంలో ఏకంగా తొమ్మిది సార్లు విద్యుత్ ఛార్జీలను పెంచి ప్రజలపై మోయలేని భారం మోపిందని మంత్రి ధ్వజమెత్తారు. సూర్యఘర్ పథకం కింద ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు 6 లక్షల ఉచిత సోలార్ కనెక్షన్లను అందించడానికి ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందని తెలిపారు. రాష్ట్రంలో విద్యుత్ ఉత్పాదనను గణనీయంగా పెంచడం ద్వారా, బయటి రాష్ట్రాల నుంచి కొనుగోలు చేసే ఖరీదైన విద్యుత్ భారాన్ని తగ్గించామన్నారు. పునరుత్పాదక ఇంధన వనరుల ద్వారా 160 గిగావాట్ల విద్యుత్ సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.ఆర్‌డీఎస్ఎస్ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాలలో విద్యుత్ మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తున్నామని, విద్యుత్ నష్టాలను తగ్గించేందుకు పెద్ద సంఖ్యలో కొత్త సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌మిషన్ లైన్లను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి వివరించారు.

# వెన్నుపోటుకు రెండేళ్ల నిరసన.. భారీర్యాలీ

## ..కదం తొక్కిన వైసీపీ శ్రేణులు.

**- కూటమి ప్రభుత్వ తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజం. -.మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి.**







**ఆంధ్ర ప్రగతి నంద్యాల టౌన్ జూన్ 12:** నంద్యాలలో కూటమి ప్రభుత్వ వైఖరిపై వైఎస్సార్సీపీ పోరుబాట పట్టింది. చంద్రబాబు నాయుడి నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజలను, రైతులను, యువతను వంచించి రెండేళ్లు పూర్తయిందంటూ వైఎస్సార్సీపీ శ్రేణులు భారీ నిరసన ర్యాలీ చేపట్టాయి. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాలు, మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి పిలుపు మేరకు నంద్యాల జిల్లా కేంద్రంలో "వెన్నుపోటుకు రెండేళ్లు" పేరిట ఈ నిరసన కార్యక్రమం మిన్నంటింది. మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి కార్యాలయం నుండి శ్రీనివాస సెంటర్ వరకు వేలాది మంది కార్యకర్తలతో భారీ ర్యాలీ నిర్వహించారు. శ్రీనివాస సెంటర్ వద్ద దివంగత ముఖ్యమంత్రి డా. వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వ మోసాలకు నిరసనగా నాయకులు ఎడ్లబండ్లు ఎక్కి, గాడిదలపై పచ్చ గుడ్డలు కప్పి వినూత్న రీతిలో తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ భారీ నిరసన కార్యక్రమంలో మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, సీఈసీ సభ్యులు పీపీ నాగిరెడ్డి, సాయినాథ్ రెడ్డి, రామలింగారెడ్డి, శ్రీశైలం నియోజకవర్గ పరిశీలకుడు పీపీ మధుసూధన్ రెడ్డి, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి రత్నబాబు చౌదరి, రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి శశికళారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ మాబున్నీసా, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్లు పురుషోత్తం రెడ్డి, విజయశేఖర్ రెడ్డి, మహేశ్వరరెడ్డి, ఎంపీపీలు శెట్టి ప్రభాకర్, ఆర్థర్ సైమన్, వైసీపీ నంద్యాల, గోస్పాడు మండలాల అధ్యక్షులు బసవేశ్వరరెడ్డి, రాజశేఖర్ రెడ్డి, వైసీపీ నాయకులు ప్రహల్లాదరెడ్డి, రామసుబ్బారెడ్డి, రాష్ట్ర ఎస్టీ సెల్ సెక్రెటరీ శంకర్ నాయక్, జిల్లా కార్యవర్గ సభ్యులు, నంద్యాల నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు, మాజీ సర్పంచ్లు, మాజీ ఎంపీటీసీలు, మాజీ కౌన్సిలర్ లు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున ర్యాలీలో పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వ తీరుపై మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు నిప్పులు చెరిగారు....అధికారంలోకి వస్తే ఆడబిడ్డ నిధి కింద 1500 రూపాయలు, నిరుద్యోగ భృతి కింద 3000 రూపాయలు, తల్లికి వందన కింద 15 వేలు ఇస్తామని చెప్పి ఇప్పుడు లబ్ధిదారులను కుదించి ప్రజలను వంచించారని మండిపడ్డారు. గత వైసీపీ ప్రభుత్వంలో రైతులకు మద్దతు ధర ఇచ్చి పంటలు కొనుగోలు చేస్తే.. నేడు కూటమి ప్రభుత్వంలో రైతులకు యూరియా, సాగునీరు అందక రోడెక్కి నిరసనలు చేయాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. 'అన్నదాత సుఖీభవ' కింద 20 వేలు ఇస్తామని చెప్పి మోసం చేశారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి ప్రజల నడ్డి విరిచారని అభివృద్ధిని గాలికి వదిలేసి ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతికి తెరలేపారని విమర్శించారు. డీఎస్సీ స్పోర్ట్స్ కోటా అవినీతిపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

డా. వైఎస్సార్ విగ్రహాన్ని మళ్లీ ప్రతిష్ఠిస్తాం: శిల్పా రవిరెడ్డి సవాల్....నంద్యాల శ్రీనివాస సెంటర్లో డా. వైఎస్సార్ విగ్రహాన్ని ధ్వంసం చేయడంపై శిల్పా రవిరెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటువంటి విధ్వంసాలు కూటమి ప్రభుత్వంలోనే జరగడం శోచనీయమన్నారు.

"విగ్రహ విధ్వంసం జరిగిన చోటే.. నంద్యాల ప్రజల సాక్షిగా డా. వైఎస్సార్ కాంస్య విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించి తీరుతా. ఎవరైనా అడ్డుకుంటే ఊరుకునేది లేదు. ప్రభుత్వం బాధ్యత తీసుకోకపోతే నా సొంత ఖర్చులతోనే విగ్రహాన్ని ఏర్పాటు చేస్తానని శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి సవాల్ చేశారు. అధికార బలంతో వైఎస్సార్ కళ్యాణ మండపం, శిల్పా సహకార్ సూపర్ మార్కెట్ దుకాణాలను లాక్కున్నారని.. శిల్పా సేవా కార్యక్రమాలను అడ్డుకోవాలని చూస్తే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. జర్నలిస్టులకు ఇస్తామన్న 5 సెంట్ల ఇళ్ల స్థలాల హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో వైఎస్సార్సీపీ మళ్లీ అధికారం చేపట్టడం ఖాయమని, కార్యకర్తలు ధైర్యంగా ప్రజా సమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు.

అనంతరం జరిగిన బహిరంగ సభలో ఎమ్మెల్సీలు ఇసాక్ బాష, కల్పలతా రెడ్డి కూటమి ప్రభుత్వ తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చలేదని, ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చారని విమర్శించారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు అన్యాయం చేశారని, ప్రధానంగా రైతులు, యువత, మహిళలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని ఆరోపించారు. రాష్ట్రంలో అవినీతి, అరాచకాలు, దౌర్జన్యాలు పేట్రేగిపోతున్నాయని, ప్రజలకు వైసీపీ అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు వైసీపీ భలోపేతానికి అహర్నిషలు పనిచేయాలని రాన్ను రోజుల్లో వైసీపీ అధికారం చేపట్టడం జరుగుతుందని భరోసానిచ్చారు. రెండేళ్ల పాలనలో కూటమి ప్రజలకు చేసిన వెన్నుపోటును విస్తృతంగా ప్రచారం చేయాలని కూటమి ప్రభుత్వాన్ని గద్దె దింపాలని పిలుపునిచ్చారు.

## పద్మావతి ఏజెన్సీ అక్రమాలపై చర్యలు తీసుకోండి.

**- తొలగించిన 13 మంది శానిటేషన్ కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 12:** నంద్యాల ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో గత 20 సంవత్సరాల నుండి ప్రాణాలు పణంగా పెట్టి సేవలందిస్తున్న 13 మంది మెడికల్ శానిటేషన్ కార్మికులను అన్యాయంగా విధుల్లోంచి తొలగించడాన్ని నిరసిస్తూ చేపట్టిన కార్మికుల దీక్షలు ఏడో రోజుకు చేరుకున్నాయి. శుక్రవారం నంద్యాల ప్రభుత్వాసుపత్రి వద్ద జరుగుతున్న ఈ దీక్షలకు రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుబ్బారెడ్డి, సోమన్న, అలాగే ఏఐటీయూసీ జిల్లా నాయకులు మురళీధర్ లు హాజరై తమ సంపూర్ణ మద్దతును ప్రకటించారు. ఈ సందర్భంగా ఏపీ మెడికల్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ & వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి. శ్రీనివాసులు ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా రాయలసీమ జోన్-3 లో పద్మావతి మెడికల్ ఏజెన్సీ కార్మికుల పట్ల నిరంకుశంగా, అనాగరికంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. కేవలం 50 సంవత్సరాల వయస్సు పూర్తి అయ్యాయనే వంకతో, ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా 13 మంది శానిటేషన్ కార్మికులను అనాలోచితంగా, ఏకపక్షంగా తొలగించడం దుర్మార్గమన్నారు. పద్మావతి ఏజెన్సీ చేస్తున్న అక్రమాలపై 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' (గ్రీవెన్స్) లో ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా అధికార యంత్రాంగం స్పందించకపోవడం దారుణమన్నారు. కొందరు అధికారుల అండ చూసుకునే ఏజెన్సీ నిర్వాహకులు శ్రమజీవుల పొట్ట గొడుతున్నారని ఆరోపించారు.

తొలగించిన 13 మంది మెడికల్ శానిటేషన్ కార్మికులను ఎటువంటి నిబంధనలు లేకుండా వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, కార్మికులకు రావాల్సిన 6 నెలల బకాయి జీతాలను పద్మావతి మెడికల్ ఏజెన్సీనే వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే శానిటేషన్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు, చట్టబద్ధంగా రావలసిన ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలన్నారు. తొలగించిన శానిటేషన్ కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకునేంత వరకు, బాధితులకు న్యాయం జరిగే వరకు ఏఐటీయూసీ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పోరాటాలు, ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో బాధితులైన శానిటేషన్ కార్మికులు సుశీలమ్మ, తులశమ్మ, రాజమ్మ, సులోచన, సునీత, వెంకటేశ్వరమ్మ, నాగేశ్వరమ్మలతో పాటు పలువురు కార్మికులు, కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## రీకౌంటింగ్ లో సత్తా చాటిన బాలాకాడమీ స్కూల్ విద్యార్థులు.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల టౌన్ జూన్ 12:** పదవ తరగతి పబ్లిక్ పరీక్షలో బాల అకాడమీకి చెందిన విద్యార్థులు రీకౌంటింగ్ అనంతరం మరింత మెరుగైన మార్కులు సాధించి తమ ప్రతిభను చాటారు. సుమైరా అను విద్యార్థిని గతంలో 587 మార్కులు పొందగా, రీకౌంటింగ్ అనంతరం 591 మార్కులతో బాల అకాడమీలో ప్రథమ స్థానంలో నిలిచింది. అఫ్ష అంజుమ్ అనే విద్యార్థిని కూడా గతంలో 582 మార్కులు పొందగా రీకౌంటింగ్ అనంతరం 589 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచింది. దీంతో వారి మొత్తం మార్కులు పెరిగి మరింత మెరుగైన ఫలితాలను నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా బాల అకాడమీ ప్రిన్సిపల్ మేడం మాధవి లత గారు మాట్లాడుతూ'విద్యార్థుల కృషి ఎప్పటికి వృధా కాదు. రీకౌంటింగ్ ద్వారా వారికి రావలసిన మార్కులు రావడం ఆనందదాయకం ఇది వారి శ్రమకు దక్కిన న్యాయం' అని పేర్కొన్నారు. విద్యార్థుల విజయంపై ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలియజేశారు. బాల అకాడమీ విద్యార్థులు ప్రతిభతో పాటు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతూ మరిన్ని విజయాలు సాధించాలని పాఠశాల యాజమాన్యం ఆకాంక్షించింది

# రైతులకు ఇబ్బంది కలిగిస్తున్న..
# ఎర్ర మట్టి మాఫియా..!

**..రైతుల బాధలు వర్ణనాతీతం. పట్టించుకోని సంబంధిత అధికారులు.**





**ఆంధ్ర ప్రగతి మహానంది, జూన్ 12:** రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్న ఎర్రమట్టి మాఫియా. మహానంది మండలం గోపవరం గ్రామంలోనీ ఓ వ్యవసాయ భూమి నుండి ఎర్రమట్టి అక్రమ రవాణా జరుగుతున్న విషయం వార్తాపత్రికల్లో, సోషల్ మీడియాలలో వస్తున్న విషయం తెలిసిందే, అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడంతో ఇష్టానుసారంగా ఎర్రమట్టి మాఫియా పైశాచిక ఆనందం పొందుతుందని రైతులు వాపోతున్నారు. నేడు తాజాగా ఆచార్యా ఎన్జీ రంగా వ్యవసాయ కళాశాల సమీపంలోని కాశిరెడ్డి నాయన దగ్గర ఉన్న పిల్లకాలువగుండా ఎర్ర మట్టి తరలించుకుంటూ రాత్రివేళ రైతులు ఎవరూ లేని సమయంలో ఓ మట్టి కుప్పను దారికి అడ్డంగా విడిచిపెట్టి వెళ్లడంతో రైతులు పండించుకున్న పంటను రవాణా చేసుకునేందుకు ఇబ్బందికరంగా ఉందని, రెండు కిలోమీటర్ల మేర రైతులు అరటి గెలలు, మునక్కాయల మూటలు మోసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని, మట్టి తరలించే వారికి ఉదయం నుండి చెబుతూనే ఉన్న నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని రైతులు మండిపడుతున్నారు. మండలంలోని అధికారుల సైతం సమస్యను తెలియజేసిన ఏ ఒక్క అధికారి పట్టించుకోవడంలేదని రైతులు తెలుపుతున్నారు. అదేవిధంగా రోడ్డు మొత్తం నాశనం చేశారని రాత్రింబవళు తేడా లేకుండా ఎర్రమట్టి తరలిస్తున్న ఏ ఒక్క అధికారి తెలిసి తెలియనట్టు వ్యవహరించడంపై రైతులు మండిపడుతున్నారు. వ్యవసాయాన్ని కొల్లగొట్టేందుకే మట్టి మాఫియా, మండలంలోని పలువురు అధికారులు పాల్పడుతున్నారని, ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి ఎర్రమట్టి మాఫియాకు, సహకరిస్తున్న పలువురు మండల అధికారులపై చర్యలు తీసుకోవాలని చుట్టుపక్కల రైతులు కోరుతున్నారు.

## టీడీపీ కార్యాలయానికి కేటాయించిన భూమిని రద్దు చేయాలి.

**వ్యవసాయ పరిశోధన స్థానంలో ఉన్న కలెక్టరేట్‌ను తక్షణమే తరలించాలి.**

**అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం.**

**అఖిలపక్ష సమావేశానికి కూటమి పార్టీలు మరియు ప్రతిపక్ష పార్టీ డుమ్మా.**



**ఆంధ్ర ప్రగతి!నంద్యాల జూన్ 12:** వ్యవసాయ రంగం మరియు ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన రెండు కీలక అంశాలపై చర్చించి ఉమ్మడి కార్యాచరణ రూపొందించేందుకు రాయలసీమ సాగునీటి సాధన సమితి ఆధ్వర్యంలో శుక్రవారం నంద్యాలలోని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక కార్యాలయంలో అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించబడింది.

నూనెపల్లె మార్కెట్ యార్డులోని రెండు ఎకరాల ప్రభుత్వ భూమిని తెలుగు దేశం పార్టీ కార్యాలయ నిర్మాణం కోసం కేటాయించడం, అలాగే నంద్యాల వ్యవసాయ పరిశోధన స్థానం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక కలెక్టరేట్ కార్యాలయాన్ని ఇతర అనువైన ప్రాంతానికి తరలించడం వంటి అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు.

ఈ సమావేశానికి రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథ రామిరెడ్డి అధ్యక్షత వహించారు. ఎన్డీఏ కూటమిలోని తెలుగుదేశం పార్టీ, జనసేన, బీజేపీ పార్టీలను మరియు వైఎస్సార్సీపీని మినహాయించి మిగిలిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, రైతు సంఘాలు, ప్రజా సంఘాల నాయకులు సమావేశంలో పాల్గొన్నారు.

సమావేశంలో పలువురు వక్తలు మాట్లాడుతూ వ్యవసాయ రంగ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న మార్కెట్ యార్డులను బలోపేతం చేయాల్సిన అవసరం ఉన్న సమయంలో, నూనెపల్లె మార్కెట్ యార్డులోని సుమారు రూ.70 కోట్ల విలువైన రెండు ఎకరాల భూమిని రైతుల ప్రయోజనాల కోసం వినియోగించకుండా రాజకీయ పార్టీకి కేటాయించడం తీవ్ర అభ్యంతరకరమని పేర్కొన్నారు. కేవలం సంవత్సరానికి రూ.1,000 లీజుతో 33 సంవత్సరాల కాలానికి భూమిని కేటాయించడం ప్రజా ప్రయోజనాలకు విరుద్ధమని విమర్శించారు.

అదేవిధంగా, నంద్యాల వ్యవసాయ పరిశోధన స్థానం ప్రాంగణంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన కలెక్టరేట్ కార్యాలయాన్ని అధికారంలోకి వచ్చిన వెంటనే తరలిస్తామని గతంలో హామీ ఇచ్చిన తెలుగుదేశం పార్టీ, అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా ఆ హామీని అమలు చేయకపోవడం విచారకరమని సమావేశం అభిప్రాయపడింది. మరోవైపు పార్టీ కార్యాలయ నిర్మాణం కోసం రైతు ప్రయోజనాలకు ఉపయోగపడే మార్కెట్ యార్డ్ భూమిని కేటాయించడాన్ని తీవ్రంగా ఖండించింది.

ప్రభుత్వం వెంటనే నూనెపల్లె మార్కెట్ యార్డు భూమిని తెలుగు దేశం పార్టీకి కేటాయించిన ప్రభుత్వ ఉత్తర్వును రద్దు చేయాలని, వ్యవసాయ పరిశోధన స్థానం ప్రాంగణం నుండి కలెక్టరేట్ కార్యాలయాన్ని తక్షణమే తరలించి పరిశోధన కేంద్రాన్ని పూర్తిస్థాయిలో పునరుద్ధరించాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది.

ఈ అంశాలపై స్థానిక ప్రజాప్రతినిధి, మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్ కి అఖిలపక్ష వేదిక తరఫున వినతిపత్రం అందజేయాలని నిర్ణయించారు. వినతిపత్రం సమర్పించిన 15 రోజులలోగా ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోకపోతే, ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఉద్యమ కార్యాచరణ చేపట్టాలని సమావేశం నిర్ణయించింది.

ఈ సమావేశంలో సీపీఎం, సీపీఐ, పార్టీ మరియు అనుబంధ రైతు సంఘాల నాయకులు రాజశేఖర్, సామన్న, రామచంద్ర, సుబ్బారెడ్డి, న్యూ డెమోక్రసీ పార్టీ నాయకుడు చౌడప్ప, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు మస్తాన్, చింతలయ్య, ప్రజా సంఘాల నాయకులు అడ్వకేట్ శంకరయ్య, కొండన్న, సత్యనారాయణ గుప్తా, జానయ్య, రైతు సంఘాల నాయకులు బి.కె. మహేశ్వర్ రెడ్డి, నంది రైతు సమాఖ్య మరియు గడివేముల రైతు సంఘం నాయకులు రామ్మోహన్ రెడ్డి, రాయలసీమ సాగునీటి సాధన సమితి కార్యవర్గ సభ్యులు ఏర్వ రామచంద్రారెడ్డి, పట్నం రాముడు, మనోజ్, ప్రచార కార్యదర్శి నిట్టూరి సుధాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# నాలుగు మోటర్ సైకిల్లు స్వాధీనం.



**ఆంధ్ర ప్రగతి మహానంది జూన్ 12:** 4 మోటార్ సైకిల్ లను స్వాధీనం చేసుకొని నలుగురు ముద్దాయిలను అరెస్టు చేసినట్లు మహానంది ఎస్ఐ రామ్మోహన్ రెడ్డి శుక్రవారం పేర్కొన్నారు. ఈనెల 9వ తేదీన మహానంది దేవస్థానం వెనుక భాగాన నిలిపి ఉంచిన పల్సర్ మరియు హెచ్ ఎఫ్ డీలక్స్ మోటార్ సైకిళు ్ళ చోరీకి గురి అయినట్లు ఎస్ఐ తెలిపారు. వీటితోపాటు నంద్యాల 3 టౌన్ పరిధిలో ఒక మోటార్ సైకిల్ ఆళ్లగడ్డ పరిసర ప్రాంతంలో ఒక మోటార్ సైకిల్ చోరీకి గురికాగా ఈ నాలుగింటిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. పాల్తి గోపి నాయక్/ ఎంఎస్ నగర్ నంద్యాల, మీనుగ రాజు ఎన్జీవో కాలనీ నంద్యాల షరీఫ్ నగర్, దొడ్డగాళ్ల ప్రకాష్ చిన్న మల్కాపురం డోన్( ప్రస్తుతం గోస్పాడు మండలం యాలూరు నివాసం), షేక్ షాబీర్ హుస్సేన్ నాగుల కట్ట దేవ నగర్, నంద్యాల కు చెందిన నలుగురు ముద్దాయిలను నంద్యాల గిద్దలూరు రహదారిలోని నంది పల్లె మెట్ట వద్ద అరెస్టు చేసి వారి నుండి 4 మోటర్ సైకిల్ ను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు. వీటి విలువ దాదాపు 2, 70 వేల రూపాయలు ఉంటుందన్నారు. ముద్దాయిలు మద్యానికి బానిసయి మోటార్ సైకిల్ చోరీలకు పాల్పడినట్లు ఎస్సై రామ్మోహన్ రెడ్డి తెలిపారు. నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ శెరాన్ మరియు ఎస్డిపిఓ కుమారి మంద జావలి ఆల్ఫోనిస్, ముద్దాయిల అరెస్టుకు సంబంధించి సిబ్బందిని అభినందించారని మహానంది ఎస్ఐ రామ్మోహన్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో నంద్యాల రూరల్ సీఐ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పోలీస్ సంక్షేమ దివస్.

**-స్వయంగా సిబ్బంది అర్జీలను స్వీకరించి, త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు ఎస్పీ ఆదేశం.**




**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా క్రైమ్ జూన్ 12:** పోలీసు సిబ్బంది సంక్షేమానికి తాము అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని నంద్యాల జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ (ఎస్పీ) సునీల్ షోరాణ్ పేర్కొన్నారు. పోలీస్ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నేడు జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన "పోలీస్ సంక్షేమ దివస్" (గ్రీవెన్స్ డే) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నంద్యాల జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లు, విభాగాలలో విధులు నిర్వర్తిస్తున్న పోలీసు సిబ్బంది, హోంగార్డులు హాజరై, తమ వ్యక్తిగత, వృత్తిపరమైన సమస్యలను ఎస్పీ కి విన్నవించుకున్నారు. సిబ్బంది నుండి వినతులను స్వయంగా స్వీకరించిన జిల్లా ఎస్పీ , వారి సమస్యలను సమగ్రంగా అడిగి తెలుసుకున్నారు. బాధితుల సమస్యలపై సత్వరమే తగు పరిష్కార చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆయన సిబ్బందికి భరోసా కల్పించారు. అంతేకాకుండా, ఆయా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత పోలీస్ ప్రధాన కార్యాలయ అధికారులను ఎస్పీ అక్కడికక్కడే ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ మాట్లాడుతూ "నిరంతరం విధి నిర్వహణలో నిమగ్నమయ్యే పోలీసు సిబ్బంది మానసిక ప్రశాంతత, వారి సంక్షేమం మాకు ముఖ్యం. 'పోలీస్ వెల్ఫేర్ డే' ద్వారా సిబ్బంది సమస్యలపై సత్వర చర్యలు తీసుకుని పరిష్కరిస్తున్నాం. విధుల్లో సిబ్బంది ఎలాంటి ఇబ్బందులు పడకుండా వారి సమస్యలను తొలగించడం ద్వారా, వారు ప్రజలకు మరింత మెరుగైన, నాణ్యమైన సేవలు అందించేలా చేయడమే మా ప్రధాన లక్ష్యం."ఈ కార్యక్రమంలో జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా తాటికొండ బుగ్గరాముడు జన్మదిన వేడుకలు







**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 12:**
నంద్యాల టౌన్ 38వ వార్డు వై.యస్.ఆర్ నగర్ నందు తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ తాటికొండ బుగ్గరాముడు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు ఆయన అభిమానులు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ నిండు నూరేళ్ళు సుఖ సంతోషాలు ఆయువు ఆరోగ్యాలతో ఇలాంటి పుట్టిన రోజు వేడుకలు మరెన్నో జరుపోకోవలని ఆ దేవుడిని మనసారా కోరుకుంటూ రాబోయే రోజుల్లో ఆయన ఉన్నత స్థాయికి చేరుకోవాలని, రాజకీయ పరంగా ఎన్నో ఉన్నత పదవులు అనుభవించాలి అని ఆయన అభిమానులు ఆ దేవుడిని మనసారా వేడుకుంటున్నాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో బుగ్గరాముడు మాట్లాడుతూ వార్డు ప్రజల మధ్యలో ఆయన అభిమానుల మధ్యలో ఈ పుట్టిన రోజు వేడుకలు జరుపుకోవడం చాలా సంతోషంగా ఉంది అని ఆయన అన్నారు. రాబోయే రోజుల్లో తెలుగుదేశం పార్టీ కొరకు



మంత్రి ఫరూక్ కుటుంభం కొరకు అహర్నిశలు కృషి చేస్తాను అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వై.యస్.ఆర్ నగర్ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, బుగ్గరాముడు గారి అభిమానులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ప్రజా సేవలో అలుపెరుగని యోధుడు..
# తాటికొండ బుగ్గ రాముడు.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 12:**
నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం శ్రమిస్తూ, 38 వార్డ్ ప్రజలకు అందుబాటులో ఉంటూ, పార్టీ బలోపేతం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న నాయకుడు 38వ వార్డు వైఎస్సార్ నగర్ టిడిపి ఇంచార్జి తాటికొండ బుగ్గ రాముడు గారు. నేడు ఆయన పుట్టినరోజు సందర్భంగా వారికీ పుట్టినరోజు శుభాకాంక్షలు .

**ప్రజా సమస్యల పరిష్కారం పట్ల అంకితభావం:**
స్థానిక 38 వార్డ్ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, వాటిని పరిష్కరించడంలో బుగ్గ రాముడు గారు ప్రత్యేక చొరవ చూపుతారు. వార్డు అభివృద్ధిలో ఆయన చూపుతున్న చొరవ స్థానికులకు ఎంతో మేలు చేకూరుస్తోంది. వైఎస్సార్ నగర్ పరిధిలో ఏ చిన్న సమస్య తలెత్తినా, వెంటనే స్పందించి అధికారుల దృష్టికి తీసుకెళ్లడం ఆయన ప్రత్యేకత.

**పార్టీ పటిష్టతలో కీలక పాత్ర:**
తెలుగుదేశం పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో,



కార్యకర్తలను సమన్వయం చేయడంలో బుగ్గ రాముడు గారు కీలక పాత్ర పోషిస్తున్నారు. పార్టీ పిలుపునిచ్చిన ప్రతి కార్యక్రమంలోనూ తనదైన శైలిలో ముందుండి నడిపిస్తూ, నాయకత్వానికి అండగా ఉంటున్నారు. ప్రజలకు, పార్టీకి మధ్య వారధిలా ఉంటూ, నాయకునిగా తనదైన ముద్ర వేసుకున్నారు.

**ఆయన పుట్టినరోజు వేడుకలు:**
ఈ సందర్భంగా బుగ్గ రాముడు గారి నివాసం వద్ద అభిమానులు, కార్యకర్తలు సందడి చేస్తున్నారు. ఆయన ఆయురారోగ్యాలతో వర్ధిల్లి, మరిన్ని ఉన్నత పదవులను అధిష్టించి, ప్రజలకు ఇంకా పెద్ద ఎత్తున సేవలు అందించాలని పలువురు ఆకాంక్షిస్తున్నారు. ఆయన చేపట్టిన ప్రజాసేవ కార్యక్రమాలు, సేవా దృక్పథం ఎంతోమందికి స్ఫూర్తిదాయకం.
ఈ సందర్భంగా తాటికొండ బుగ్గ రాముడు కి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు భవిష్యత్తులో ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని భగవంతుని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నాను.

# మహానంది దేవస్థానం లో ఘనంగా యోగా కార్యక్రమం.

**..యోగాను నిత్యజీవితంలో భాగంగా చేసుకుని ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కృషి చేయాలి.**

**..జూన్ 21న లక్ష మందితో జిల్లా వ్యాప్తంగా భారీ యోగా కార్యక్రమం.**

**..యోగాంధ్ర-2026 విజయవంతానికి ప్రజలందరూ భాగస్వాములు కావాలి.**

**..జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పిలుపు.**





**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్ 12:**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర-2026 కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మహానంది దేవస్థానం ప్రాంగణంలో నిర్వహించిన సామూహిక యోగా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, వివిధ శాఖల జిల్లా అధికారులు, యోగా సాధకులు, విద్యార్థులు, యువత, ప్రభుత్వ ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని యోగాభ్యాసం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యోగా ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత, ఏకాగ్రత పెంపొందుతాయని తెలిపారు. నిత్యం 30 నుంచి 45 నిమిషాల పాటు యోగాభ్యాసం చేయడం ద్వారా ఒత్తిడి తగ్గి ఆరోగ్యవంతమైన జీవనశైలి అలవడుతుందని పేర్కొన్నారు. వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితాల్లో సమతుల్యత సాధించడంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని, నాయకత్వ లక్షణాలు, జట్టు భావన వంటి విలువలను కూడా పెంపొందిస్తుందని వివరించారు.
జూన్ 21న జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవం నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్ర-2026 కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంకల్పంతో జూన్ 7న ప్రారంభమైన ఈ కార్యక్రమాలు జూన్ 21 వరకు గ్రామ, వార్డు, మండల, జిల్లా స్థాయిల్లో నిరంతరాయంగా కొనసాగుతున్నాయని తెలిపారు. యోగాపై ఆసక్తి కలిగిన ప్రతి ఒక్కరూ యోగాంధ్ర యాప్ ద్వారా నమోదు చేసుకొని అంతర్జాతీయ యోగా దినోత్సవానికి సిద్ధం కావాలని కలెక్టర్ ప్రజలకు పిలుపునిచ్చారు. జిల్లాలో ఇప్పటికే శ్రీశైలం దేవస్థానం, మహానంది దేవస్థానాల్లో యోగా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. జూన్ 17న జిల్లాకు కేటాయించిన ప్రత్యేక థీమ్ ఆధారంగా యోగాంధ్ర అసోసియేషన్ సభ్యులందరితో కలిసి ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అలాగే జూన్ 21న జిల్లా వ్యాప్తంగా గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు సుమారు ఒక లక్ష మందితో భారీ యోగా కార్యక్రమం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా యోగా ప్రదర్శన ఇచ్చిన మహిళా బృందాన్ని కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. యోగా శిక్షణ అందించిన రమ్యతో పాటు ప్రదర్శనలో పాల్గొన్న ఐదుగురు సభ్యులు మహిళలే కావడం విశేషమని పేర్కొన్నారు. మహిళల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించే ఉద్దేశంతో ఈ ప్రత్యేక ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జాతీయ స్థాయి యోగా పోటీల్లో ప్రతిభ కనబరిచి ఛాంపియన్‌గా నిలిచిన వందితను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించి, యువతకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. వర్షం కురుస్తున్నప్పటికీ



ఉదయం నుంచే కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించిన తహసీల్దార్, ఎంపీడీవో, ఆర్డీవో, మహానంది దేవస్థానం ఈఓ, జిల్లా యంత్రాంగం, ఆయుష్ మరియు వైద్య బృందాలకు, అలాగే కార్యక్రమ విజయవంతానికి నాయకత్వం వహించిన జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్‌కు కలెక్టర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.
మహానంది క్షేత్రంలో నిర్వహించిన ఈ యోగా కార్యక్రమం పాల్గొన్న వారిలో ఆరోగ్య చైతన్యాన్ని పెంపొందించడంతో పాటు యోగాపై మరింత ఆసక్తిని కలిగించిందని కలెక్టర్ పేర్కొన్నారు.

# 32వ స్వర్ణ వార్డును పరిశీలించిన కలెక్టర్ జి. రాజకుమారి.

**..స్వర్ణ వార్డు సేవలపై సమీక్ష.. ఫిర్యాదులను గడువులోగా పరిష్కరించాలని అధికారులకు కలెక్టర్ ఆదేశం.**

**..ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరేలా చర్యలు తీసుకోవాలి.**

**..జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా.**





**ఆంధ్ర ప్రగతి నంద్యాల టౌన్ జూన్ 12:** ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా అందుతున్నాయో లేదో తెలుసుకునేందుకు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి శుక్రవారం నంద్యాల పట్టణంలోని 32వ స్వర్ణవార్డు సచివాలయాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా స్వర్ణ వార్డులో అందిస్తున్న వివిధ పౌర సేవలు, ప్రజల నుండి స్వీకరిస్తున్న దరఖాస్తుల పరిష్కార విధానం, రికార్డుల నిర్వహణ, సిబ్బంది హాజరు తదితర అంశాలను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. స్వర్ణవార్డులో ప్రజలకు అందుబాటులో ఉన్న సేవల వివరాలు, సంక్షేమ పథకాల అమలు తీరు, ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వ్యవస్థపై సంబంధిత సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు ఆశ్రయిస్తున్నందున ప్రతి దరఖాస్తును నిర్దేశిత గడువులోగా పరిష్కరించి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని, అర్హులైన ప్రతి లబ్ధిదారునికి పథకాల ప్రయోజనాలు చేరేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. స్వర్ణవార్డు పరిధిలోని కుటుంబాల వివరాలు, పథకాల అర్హతలు, సేవల డెలివరీ స్థితిగతులపై ఎప్పటికప్పుడు సమాచారాన్ని నవీకరించాలని సూచించారు. స్వర్ణవార్డులో నిర్వహిస్తున్న రికార్డులు, ఫైళ్ల నిర్వహణ, కార్యాలయ పరిశుభ్రత, ప్రజలకు అందుబాటులో ఉంచిన సౌకర్యాలను పరిశీలించిన కలెక్టర్, కార్యాలయ ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ప్రజలకు మర్యాదపూర్వకంగా సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యానికి తావులేకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. ఈ సందర్భంగా స్వర్ణ వార్డుకు వచ్చిన పలువురు స్థానికులతో కలెక్టర్ ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలు, అవసరాలు తెలుసుకున్నారు. అందిన వినతులను సంబంధిత శాఖల అధికారులు వెంటనే పరిశీలించి తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సేవలు స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సచివాలయాల ద్వారానే చేరుతున్నందున ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించేలా అధికారులు, సిబ్బంది కృషి చేయాలని కలెక్టర్ సూచించారు.

EDITOR.PRINTED,PUBLISHED AND OWENED BY CHINNA MATHANGI SREENIVASULU AND PRINTED AT:JRD PUBLICATIONS, # 11-107, ABBAS NAGAR, DISTRICT- KURNOOL,ANDHRA PRADESH- 518002
AND PUBLISHED FROM #24-100B, HARIJANAWADA, NANDYAL, ANDHRA PRADESH- 518501 RNI : APTEL/2023/89112, PHONE NO: 81211 33006, EMAIL ID : SREENIVAS.CM77@GMAIL.COM

## “రెండేళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం“ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి.

**..ప్రజలకు చేరువైన ప్రభుత్వ విజయాలను విస్తృతంగా చాటాలి.**

**..జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల టౌన్ జూన్ 12:** రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న “రెండేళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం“ కార్యక్రమాలను జిల్లాలో విజయవంతంగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం టేక్కే మార్కెట్ యార్డులో ఈ నెల 17వ తేదీన జరగనున్న “రెండేళ్ల నమ్మకం – అభివృద్ధి, సంక్షేమం“ కార్యక్రమ ఏర్పాట్లపై జాయింట్ కలెక్టర్ క్షేత్ర స్థాయిలో సమీక్షించారు. జాయింట్ కలెక్టర్ వెంట నంద్యాల ఆర్డీఓ విశ్వనాథ్, మున్సిపల్ కమీషనర్ శేషన్న, సిపిఓ ఓబులేసు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 17వ తేదీన ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న “రెండేళ్ల నమ్మకం – అభివృద్ధి, సంక్షేమం“ కార్యక్రమాన్ని అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో ముందస్తు ఏర్పాట్లను పూర్తిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం గత రెండేళ్లలో అమలు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల ఫలితాలను ప్రజలకు విస్తృతంగా తెలియజేసేలా కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. అదే విధంగా సభా ప్రాంగణంలో పారిశుధ్యం, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు, నిరంతర విద్యుత్ సరఫరా, ఎల్ఈడి స్క్రీన్లు, వైద్య శిబిరాలు, రవాణా సదుపాయాలు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

## ఇంధనాన్ని పొదుపు చేద్దాం, ప్రజా రవాణాను వాడదాం.

**..ఆర్టీసీ బస్సులో ప్రయాణించి ఆదర్శంగా నిలిచిన జిల్లా కలెక్టర్ డా.ఏ. సిరి, జేసీ నూరుల్ ఖమర్.**



**ఆంధ్ర ప్రగతి కర్నూలు, జూన్ 12:** ఇంధన వినియోగాన్ని తగ్గించి, ప్రజా రవాణా వ్యవస్థను ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి తెలిపారు.శుక్రవారం ప్రభుత్వం చేపట్టిన ఇంధన పొదుపు చర్యల్లో భాగంగా ఒక్క నెల–ఒక నియోజకవర్గం–నాలుగు పర్యటనలు కార్యక్రమంలో భాగంగా పత్తికొండ నియోజకవర్గంలోని తుగ్గలి మండలంలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుండి సమస్యల వినతులను స్వీకరించేందుకు ప్రభుత్వ వాహనంలో కాకుండా ఆర్టీసీ బస్సులో జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి, జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ ప్రయాణించి ఆదర్శంగా నిలిచారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అధికారులు, సిబ్బంది, ప్రజలు ఇంధన పొదుపు చర్యల్లో భాగస్వాములు కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.. సాధ్యమైనంత వరకు వ్యక్తిగత వాహనాలను తగ్గించి, ఆర్టీసీ బస్సులు వంటి ప్రజా రవాణా వ్యవస్థలను వాడటం అలవాటు చేసుకోవాలన్నారు. మన సొంత రవాణా సంస్థ అయిన ఆర్టీసీ బస్సులను ఆదరించడం ద్వారా పర్యావరణానికి మేలు జరగడమే కాకుండా, ప్రభుత్వ సంస్థలు బలోపేతం అవుతాయన్నారు.కలెక్టర్ తో పాటు డి ఆర్ డి ఏ పిడి రమణ రెడ్డి, ఆర్ డబ్ల్యూ ఎస్ ఎస్ఈ మనోహర్, ఆర్టీసీ ఆర్ ఎమ్ శ్రీనివాసులు, డి ఎస్ ఓ రాజా రఘువీర్, డి పి ఓ భాస్కర్, డ్వామా ఏపిడి మాధవి, తదితరులు పాల్గొన్నారు.

# టిటిడి సీడ్ లడ్డూ కవర్లు సృష్టికర్త..

# మన ఆత్మకూరు శాస్త్రవేత్తే..!

**-తిరుమల లడ్డూ ప్రసాదానికి పర్యావరణ అనుకూల ‘సీడ్ పేపర్ కవర్లు‘ కనిపెట్టిన ఆత్మకూరు శాస్త్రవేత్త.**

**-డి ఆర్ డి ఓ శాస్త్రవేత్త డాక్టర్ వీరబ్రహ్మం.**








**ఆంధ్ర నంద్యాల జిల్లా /ఆత్మకూరు జూన్ 12:** కలియుగ వైకుంఠ క్షేత్రం తిరుమలలో శ్రీవారి లడ్డు ప్రసాదానికి భూగోళ వ్యాప్తంగా ఓ ప్రత్యేకత, ఆధ్యాత్మిక విశేషత ఉంది. తిరుమల తిరుపతి దేవస్థానం భక్తులకు అందించే లడ్డు ప్రసాద సంచులు పర్యావరణ అనుకూలమైనవిగా భావించి భక్తులకు అందిస్తుంది. అయితే లడ్డు ప్రసాదాల సంచుల రూపకల్పన, సృష్టికర్త ఎవరు బయటి ప్రపంచానికి తెలియదు. పైగా ఆ సంచుల కింద ఉన్న తులసి గింజలు మొక్కలుగా ఎదిగేలా విత్తన కాగిత కవర్లను కనిపెట్టింది.

డాక్టర్. వీరబ్రహ్మం అనే శాస్త్రవేత్త. ఈయన నంద్యాల జిల్లా శ్రీశైలం నియోజకవర్గం ఆత్మకూరు సమీప కరివేన గ్రామానికి చెందిన వ్యక్తి. ఆత్మకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివిన వీరబ్రహ్మం డి ఆర్ డి ఓ లో ప్రముఖ శాస్త్రవేత్త. ఆత్మకూరు నల్లమల పరిసరాల్లో జన్మించిన వీరబ్రహ్మం చిన్ననాటి నుంచే సూక్ష్మ పరిశోధనలు చేస్తూ.. డి ఆర్ డి ఓ లో శాస్త్రవేత్త స్థాయికి ఎదిగాడు.

రోజు రోజుకు పర్యావరణానికి విఘాతం కలిగించే ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలనే ఉద్దేశంతో పరిశోధనలు ప్రారంభించాడు. మొదటగా రోజుకు వేలాదిమంది భక్తులు సందర్శించే తిరుమల క్షేత్రంలో స్వామివారి లడ్డు ప్రసాదాలను ప్లాస్టిక్ కవర్లలో అందించడాన్ని గమనించాడు. తన బృందంలోని సహాయకులతో కలిసి పర్యావరణానికి అనుకూలమైన గ్రీన్ మంత్ర కవర్లను సృష్టించాడు.

సీడ్ సీడ్ పేపర్ కవర్ల అడుగు భాగంలో తులసి విత్తనాలు కాగితపు గుజ్జుతో కలిసి ఉంటాయి. సంచులను వాడిన తర్వాత ముక్కలుగా చించి మట్టిలో వేస్తే తేమకు తులసి గింజలు మొలకెత్తుతాయి. భక్తులకు ఈ సీడ్ పేపర్ తో.. ఆధ్యాత్మిక అనుబంధం పెరుగుతుంది అని శాస్త్రవేత్త వీరబ్రహ్మం అంటున్నారు. ఈ కంపోస్టబుల్ బయోడిగ్రేడబుల్ సీడెన్ బెడ్ సంచులు 150 రోజుల్లో నేల మట్టిలో కలిసిపోయి ఇరువుగా మారుతుంది.

స్వామివారి ప్రసాదంతో పాటు వచ్చే ఈ సంచులను పార వేయకుండా ఇంట్లోనే తులసి మొక్కగా మార్చుకోవడం ఒక అద్భుతమైన అనుభూతిగా భక్తులకు మిగిలి పోవడమే కాక తిరుమలలో ప్లాస్టిక్ ను దశలవారీగా నిర్మూలించేందుకు తన వంతు పరిశోధనలు చేశానని చెబుతున్నారు యువ శాస్త్రవేత్త డాక్టర్ వీరబ్రహ్మం. ఒక్కో సంచి అడుగుభాగం లో సుమారు 200 తులసి మొక్క విత్తనాలు దాగి ఉంటాయి.

తిరుమల తిరుపతి తరహా లోనే అష్టాదశ శక్తిపీఠం, ద్వాదశ జ్యోతిర్లింగం, భూ మండలానికి నాభి స్థానం శ్రీశైల క్షేత్రంలో కూడా ప్లాస్టిక్ రహిత దేవస్థానంగా తీర్చిదిద్దాలని భక్తులు, పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు. ప్రాచీన కాలంలో శ్రీశైల క్షేత్రంలో మొట్టమొదటిసారిగా కరివేన బ్రాహ్మణ నిత్య అన్నదాన సత్రాన్ని ఏర్పాటు చేసింది ఆత్మకూరు కరివేన అగ్రహారం ప్రజలే. తూర్పు కనుమల్లో భాగమైన నల్లమల అడవుల్లో శ్రీశైల క్షేత్రం చుట్టూ హిమాలయాలలోని జీవ వైవిధ్యం నెలకొంది. వేల సంఖ్యలో ఆయుర్వేద ఔషధ వృక్షాలు నిగూఢంగా ఉన్నాయి. వాటి గింజలు, మూలికలు, పత్రాలు, మృత్తికపై డి ఆర్ డి ఓ లో శాస్త్రవేత్తగా ఉన్న వీర బ్రహ్మంతో నల్లమల లో పరిశోధనలు చేయించాలని ఔత్సాహిక పరిశోధకులతోపాటు శ్రీశైల మల్లన్న భక్తులు శ్రీశైల దేవస్థానం అధికారులను కోరుతున్నారు.

తిరుమల తిరుపతి తరహాలో శ్రీశైలం క్షేత్రాన్ని అభివృద్ధి చేసి చూపిస్తామని గొప్పలు చెప్పుకుంటున్న రాజకీయ నాయకులు దేవస్థానాన్ని దోచుకోవడం తగ్గించి .. రోజురోజుకు భక్తుల సంఖ్యను మించి పెరిగిపోతున్న ప్లాస్టిక్ వ్యర్థాలను తగ్గించే విషయంపై కాస్తంతైన దృష్టి పెట్టండని మల్లన్న భక్తులు పాలకులకు సూచిస్తున్నారు.

ఆత్మకూరు ప్రాంతానికి చెందిన డి ఆర్ డి ఓ యువ శాస్త్రవేత్త డాక్టర్ వీరబ్రహ్మం అతి ప్రాచీన వేల సంవత్సరాల నాటి నల్లమల అడవులు, పర్యావరణం పై పరిశోధనలు చేసేందుకు ఓ ప్రణాళికను సిద్ధం చేసుకుంటున్నారు.

# “నీట్ “పరీక్ష ను కట్టుదిట్టంగా నిర్వహించాలి.

**..జూన్ 21 ఆదివారం రోజున నీట్ పరీక్ష. -జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి.**

**ఆంధ్ర ప్రగతి కర్నూలు ,జూన్ 12 :** ఈ నెల 21వ తారీకున “ నీట్ “ పరీక్ష ప్రశాంత వాతావరణంలో ఎటువంటి లోపాలు లేకుండా కట్టు దిట్టంగా జరిపించాలని సమావేశంలో అధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి ఆదేశించారు.

శుక్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్ లో నీట్ పరీక్ష ఏర్పాట్ల పై సంబంధిత అధికారులతో సమావేశాన్ని జిల్లా కలెక్టర్ ఏ.సిరి నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... మే నెల లో నీట్ పరీక్ష నిర్వహించిన విధంగానే కట్టుదిట్టంగా జూన్ 21న పరీక్ష యధాతథంగా ఎటువంటి లోపాలు లేకుండా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఇప్పుడు కూడా 16 పరీక్ష కేంద్రాలలో పరీక్ష నిర్వహించబడుతుంది అని గతంలో ఉన్న ఒక కేంద్రం తొలగించి మరొక కేంద్రం ను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.పరీక్ష వ్రాసే విద్యార్థులకు పరీక్ష హాల్ మంచి వాతావరణం తో పరిశుభ్రమైన గాలి , వెలుతురు తో ఉండాలని, శుభ్రమైన త్రాగునీరు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. నీట్ పరీక్ష మధ్యాహ్నం 2 నుండి 5 గంటల వరకు జరుగుతుందని , విద్యార్థులు అందరూ బయోమెట్రిక్ అటెండెన్స్ వేయించుకొని మరియు అన్ని తనిఖీలు చేయించుకుని మధ్యాహ్నం 1:30 గంటల లోగా పరీక్ష హాలు లోకి చేరుకోవాలని , పరీక్ష హాలులోకి ఎవరు కూడా సెల్ ఫోన్లు , ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్ తీసుకొని రాకూడదని వాటిని బయటనే పెట్టి రావాలని తెలిపారు.




నీట్ పరీక్ష రోజు కరెంటు సరఫరా నిరంతరాయంగా కొనసాగాలని అందుకు కావలసిన ఏర్పాట్లు చేసుకోవాలని ట్రాన్స్కో ఈ ఈ విజయ భాస్కర్ ను ఆదేశించారు. ఒక ఏఎన్ఎం తో ఓ ఆర్ ఎస్ , పెయిన్ కిల్లర్స్, ఫస్ట్ ఎయిడ్ కిట్ మొదలగు మందులతో ప్రతి సెంటర్ లో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని అవసరం మేరకు అంబులెన్స్ లు అందుబాటులో ఉంచుకోవాలని , నడవలేని అన్యదా సమర్థులైన విద్యార్థులకు వీల్ చైర్స్ సౌకర్యం అవసరం మేరకు కల్పించాలని , సంబంధిత డాక్టర్ల ఫోన్ నెంబర్లు సూపరింటెండెంట్లకు తెలియజేయాలని డిప్యూటీ డి ఎం ఎం హెచ్ ఓ భాస్కర్ ను ఆదేశించారు. వర్షాకాలం కావున పరీక్షా కేంద్రం బయట టెంపరరీ వాటర్ ప్రూఫ్ టెంట్లు కూడా ఏర్పాటు చేసుకోవాలని కోఆర్డినేటర్ పాయల్ ప్రియదర్శిని ఆదేశించారు.4,928 మంది విద్యార్థులు 16 కేంద్రాలలో పరీక్ష రాస్తూ ఉన్నందున వారి అవసరం మేరకు అన్ని పరీక్షా కేంద్రాలకు ఉదయం 11–30 గంటల నుండి కర్నూలు ఆర్టీసీ బస్టాండ్ నుండి “ నీట్ పరీక్ష స్పెషల్ “ బస్సు గా పేరు పెట్టి బస్సులు నడపాలని ఆర్టీసీ డిపో మేనేజర్ సుధారాణి ని ఆదేశించారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి ఎస్పి విక్రాంతి పాటిల్ మాట్లాడుతూ...నీట్ పరీక్ష రోజున కర్నూలు పట్టణంలో ఎక్కడ ట్రాఫిక్ కు అంతరాయం కలగకుండా చేస్తామని , 16 కేంద్రాలలో పరీక్ష నిర్వహణకు కావలసిన బందోబస్తు , క్వశ్చన్ పేపర్ల తరలింపుకు కూడా ఏర్పాటు చేస్తామని ఎస్పీ తెలియజేశారు. పరీక్ష కేంద్రాల వద్ద తనిఖీ చేయు దగ్గర మరియు పరీక్ష హాలులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని నిర్వాహకులను కోరారు. ఈ సమావేశానికి నీట్ పరీక్ష కోఆర్డినేటర్ లు పాయల్ ప్రియదర్శిని (ప్రిన్సిపాల్ కె.వి ) ,డాక్టర్ కే సత్యబాబు (ప్రొఫెసర్ ట్రిపుల్ ఐటి డిఎం ) ,డెప్యూటీ డిఎం హెచ్ ఓ డాక్టర్ భాస్కర్ , డి సి లేబర్ వెంకటేశ్వర్లు , కర్నూలు రూరల్ తాహసిల్దార్ రమేష్, అర్బన్ తాహసిల్దార్ రవి మరియు చీఫ్ సూపరిండెంట్ లు పాల్గొన్నారు.

# రైతులకు ఎరువుల పంపిణీలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలి.





**ఆంధ్ర ప్రగతి మహానంది జూన్ 12:**రైతులకు ఎరువుల పంపిణీ ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. శుక్రవారం మహానంది మండలం బుక్కాపురం గ్రామంలో ఉన్న బైసాని ట్రేడర్స్ ఎరువులు, యూరియా విక్రయ కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఎరువుల పంపిణీకి వినియోగిస్తున్న ఏపీ ఎయిమ్స్ 2.0 (ఏపీ ఏఐఎంఎస్ 2.0) ఆన్‌లైన్ యాప్ పనితీరును కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. రైతులకు ఎరువులు ఎలా పంపిణీ చేస్తున్నారనే అంశంపై వివరాలు తెలుసుకొని, అందుబాటులో ఉన్న యూరియా, డీఏపీ తదితర ఎరువుల నిల్వలు, స్టాక్ రిజిస్టర్లు, ఆన్‌లైన్ రికార్డులను తనిఖీ చేశారు. ముఖ్యంగా స్టాక్ నమోదు, పంపిణీ విధానం, రైతుల వివరాల నమోదు ప్రక్రియలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని సూచించారు.ఆర్ఎస్‌కే ఇంచార్జ్ ధృవీకరించి ఆమోదించిన పంట వివరాలు మాత్రమే డీలర్ లాగిన్‌లో కనిపిస్తాయని, వివరాలు ఆమోదం పొందని పక్షంలో రైతుల సమాచారం డీలర్‌కు అందుబాటులో ఉండదని పేర్కొన్నారు.రైతులకు ఎరువుల కొరత లేకుండా తగిన నిల్వలు అందుబాటులో ఉంచాలని, పంపిణీ ప్రక్రియలో పూర్తి పారదర్శకత పాటించాలని, ప్రభుత్వ నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు, డీలర్లకు సూచించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జెడి వెంకటేశ్వర్లు, మండల వ్యవసాయ అధికారి నాగేశ్వర్రెడ్డి, ఏఈఓ వెంకటేశ్వర్లు,సిబ్బంది పాల్గొన్నారు.

## తిమ్మాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్ 12:**రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలు పునఃప్రారంభమైన సందర్భంగా శుక్రవారం మహానంది మండలం తిమ్మాపురం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జెడ్పీహెచ్ఎస్)ను జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సందర్శించారు. కొత్త విద్యా సంవత్సరానికి హాజరైన విద్యార్థులకు పుష్పాలు అందజేసి ఆప్యాయంగా స్వాగతం పలికారు. విద్యార్థులతో మమేకమై వారి విద్యాభ్యాసం, పాఠశాలలో అందుతున్న సౌకర్యాలు, విద్యా వాతావరణం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పించేందుకు కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. ప్రతి విద్యార్థి క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరవుతూ విద్యపై పూర్తి దృష్టి సారించాలని సూచించారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం పాఠశాల ఆవరణను క్షుణ్ణంగా పరిశీలించిన కలెక్టర్, పరిశుభ్రత, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్వహణ, మధ్యాహ్న భోజన పథకం అమలు వంటి అంశాలను పరిశీలించి సంబంధిత సిబ్బందికి అవసరమైన సూచనలు చేశారు. పాఠశాల మరుగుదొడ్ల నిర్వహణను కూడా పరిశీలించి, విద్యార్థులకు అవసరమైన అన్ని పారిశుద్ధ్య సదుపాయాలు నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాల ఆవరణ విశాలంగా ఉండటంతో పెద్ద ఎత్తున మొక్కలు నాటి హరిత వాతావరణాన్ని పెంపొందించాలని సూచించారు. పాఠశాల ప్రాంగణాన్ని పచ్చదనంతో నింపేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. కొత్త విద్యా సంవత్సరాన్ని ఉత్సాహంగా ప్రారంభించిన విద్యార్థులందరికీ జిల్లా కలెక్టర్ శుభాకాంక్షలు తెలియజేస్తూ, క్రమశిక్షణ, పట్టుదల, లక్ష్యసాధనతో ముందుకు సాగి విద్యా రంగంలో ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.

# ఏ 1 ఇన్ఫోటెక్ ఇంటర్నేషనల్ టూరిజం కార్యాలయాన్ని ప్రారంభించిన మంత్రి ఎన్ఎండి ఫరూక్.

**..జమాతుల్ ఉలేమా వల్ అయిమ్మ ఫౌండేషన్ కార్యాలయాన్ని ప్రారంభించిన టిడిపి జిల్లా కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్.**






**ఆంధ్ర ప్రగతి నంద్యాల టౌన్ జూన్ 12:** నంద్యాల పట్టణంలోని చాంద్ బాడ నందలి బదర్ మసీదు సమీపంలో న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ఏ1 ఇన్ఫోటెక్ ఇంటర్నేషనల్ టూరిజం కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్, మైనార్టీ శాఖ రాష్ట్ర డైరెక్టర్ మనియార్ ఖలీల్, సౌత్ ఇండియా హజ్, ఉమ్రా అసోసియేషన్ చైర్మన్ సుల్తాన్, అధ్యక్షులు ఫయాజ్, కోశాధికారి అబ్దుల్ సలాం, జమాతుల్ ఉలేమా వల్ అయిమ్మ ఫౌండేషన్ ఇమాముల మరియు ఉలేమాల సంఘం అధ్యక్షులు అబ్దుల్ హాది సయాది, మౌలానా ఇద్రిస్, మౌలానా హుసేన్, హాఫిజ్ షరీఫ్, ముఫ్తి ఖలీల్ హుసేన్, షేక్ టైలర్ మౌలాలి, మౌలానా మహబూబ్ పీరా, టిడిపి వార్డు ఇంచార్జ్ కట్టెల ఆఫజల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మంత్రి ఫరూక్ మాట్లాడుతూ ఏ1 ఇన్ఫోటెక్ ఇంటర్నేషనల్ టూరిజం అధినేత మౌలానా ఇలియాస్ హనఫీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యాలయాన్ని ప్రారంభించడం సంతోషకరమన్నారు. ముస్లింలు పవిత్రంగా భావించే మక్కా యాత్రను నిర్వహించడం, అందులో అనుభవజ్ఞులైన మౌలానాలచే ఈ కార్యక్రమం నిర్వహించడం శుభ పరిణామమని, ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి ఫరూక్ కోరారు. ఏ1 ఇన్ఫోటెక్ ఇంటర్నేషనల్ టూరిజం అధినేత మౌలానా ఇలియాస్ హనఫీ మాట్లాడుతూ మక్కా యాత్రను పారదర్శకంగా నిర్వహిస్తామని, ప్రతి ఒక్కరూ మా ట్రావెల్స్ తరఫున ఉమ్రా యాత్రలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**జమాతుల్ ఉలేమా వల్ అయిమ్మ ఫౌండేషన్ కార్యాలయం ప్రారంభం**

జమాతుల్ ఉలేమా వల్ అయిమ్మ ఫౌండేషన్ కార్యాలయాన్ని టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ శాఖ రాష్ట్ర డైరెక్టర్ మనియార్ ఖలీల్, నీటి సంఘాల చైర్మన్ చాబోలు ఇలియాజ్, మౌలానాలు, హాఫిజ్ లు పాల్గొన్నారు.